క్లుప్తంగా

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ నేత ప్రహ్లాదరావు



రాంనగర్ గ్రామస్తులను పార్టీలో చేర్చుకుంటున్న ప్రహ్లాదరావు తదితరులు

కుల్కచర్ల: స్థానిక ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలను గెలుచుకొని సత్తాచాటాలని రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండలం రాంనగర్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశం కోసం, ధర్మం కోసం పనిచేసే ఏకైక పార్టీ బీజేపీనని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాటనిపల్లి ఆంజనేయులు, కుల్కచర్ల మండల అధ్యక్షుడు వెంకటయ్యముదిరాజ్, నాయకులు చంద్రలింగం, కొండ ఆంజనేయులు, మైపాల్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో క్షయ నిర్మూలన

వైద్యాధికారిణి ప్రియదర్శిని



వైద్య శిబిరంలో ప్రియదర్శిని తదితరులు

దౌల్తాబాద్: అవగాహనతో క్షయ నిర్మూలించొచ్చని వైద్యాధికారిణి ప్రియదర్శిని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్షయ నివారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వ్యాధి నివారణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. దీని బారిన పడిన వారికి ఉచితంగా వైద్య చికిత్సతో పాటు నెలకు రూ. వెయ్యి అందజేస్తారన్నారు. ఈ శిబిరంలో 205 మందిని పరీక్షించగా 14మందికి సోకినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంతోశ్, సూపర్ వైజర్ రఫీ, ఎంఎల్‌హెచ్‌పీ మాహత్, సిబ్బంది శ్రీధర్, ఏఎస్ఎం అనురాధ, అనిత, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యనిధి సంస్థ ద్వారా ఉద్యోగాల కల్పన



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య

పరిగి: ఉద్యోగ కల్పనకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని పురపాలక కమిషనర్ వెంకటయ్య అన్నారు. బుధవారం పరిగి పురపాలక కార్యాలయంలో ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ద్వారా మూడు కొత్త పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. వీటి కోసం రూ. 1.07 లక్షల కోట్లను కేటాయించనుందన్నారు.

దెబ్బతిన్న రోడ్లు..

వాహనదారుల పాట్లు



దోర్నాల్–అంపల్లి రహదారిలో ఏర్పడిన గుంత

ధారూరు: భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతినడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధారూరు మండల పరిధిలోని దోర్నాల్–అంపల్లి చౌరస్తా మధ్య భారీ గుంత ఏర్పడింది. ధారూరు–తాండూర్ వయా రాస్నం, ధారూరు–పరిగి వయా మోమిన్‌ఖుర్దు గ్రామాలకు వెళ్లే రహదారులు పాడై గుంతలుగా తయారయ్యాయి. ఆ దారుల గుండా వెళ్లాలంటే ప్రమాదాలకు గురవుతున్నామని చెబుతున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

శిలా ఫలకానికే పరిమితం!

- 19 ఏళ్లుగా పూర్తికాని నిర్మాణ పనులు
- అద్దె భవనంలో గనులశాఖ నిర్వహణ
- ఇరుకైన గదుల్లోనే కార్యకలాపాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు, సిబ్బంది
- పట్టించుకోని అధికారులు



అద్దె భవనంలో కొనసాగుతున్న మైన్స్ కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయంలో వేసిన శిలాఫలకం

తాండూరు రూరల్: అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్న చందంగా తాండూరు మైన్స్ ఏడీ కార్యాలయ పరిస్థితి మారింది. జిల్లాలోని 18 మండలాల్లో నాపరాతి గనులు, సుద్ద, ఎర్రమట్టి, కంకరపై రాయల్టీ రూపంలో ప్రతీ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. సుమారు రూ.130 నుంచి రూ.150 కోట్ల వరకు వస్తోంది. ఈ ఆదాయం నుంచి వివిధ అభివృద్ధి పనులకు 30 శాతం కేటాయిస్తున్నారు. ఈ నిధులు జిల్లా కలెక్టర్ అనుమతితో ప్రభుత్వ కార్యాలయాలు, సీసీరోడ్లు, డ్రైనేజీతో పాటు పలు అభివృద్ధి పనులకు డీఎంఎఫ్‌టీ కింద నిధులు మంజూరు చేసే అధికారం కలెక్టర్‌కు ఉంది. కానీ అన్ని శాఖల కార్యాలయాలకు నిధులు ఇచ్చే మైనింగ్ శాఖకు శాశ్వత భవనం లేకపోవడం విడ్డురంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

నేటికీ ప్రారంభం కాని పనులు

తాండూరు మండల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని పశువైద్య భవనం పక్కనే 2006, ఫిబ్రవరి 19న అప్పటి గనులు, భూ గర్భశాఖ మాజీ మంత్రి పి సబితారెడ్డి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరు కాకపోవడంతోనే పనులు ప్రారంభించడం లేదని అధికారులు చెబుతున్నారు.

దశాబ్దాల తరబడి ఇదే పరిస్థితి

జిల్లాలోని ఆయా మండలాల్లో నాపరాతి గనులు, ఎర్రమట్టి, సుద్ద, క్వారీ సంబంధించి పెద్ద ఎత్తున నిల్వలు ఉన్నాయి. ప్రతీ నిత్యం వివిధ పనుల కోసం ప్రజలు కార్యాలయానికి రాకపోకలు చేస్తుంటారు. కానీ మైనింగ్ ఏడీ కార్యాలయం ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతుంది. దీంట్లో ఒక ఏడీ కార్యాలయం, నాలుగు గదులు, రెండు హాల్స్ మాత్రమే ఉన్నాయి. దాదాపు 10 మంది సిబ్బంది కార్యాలయంలో పని చేస్తున్నారు. అద్దెభవనంలో అరకొర వసతులతో కాలం వెళ్లదీస్తున్నారు.

> **అద్దె చెల్లిస్తున్నాం**
>
> తాండూరు మైనింగ్ ఏడీ కార్యాలయం అద్దెభవనంలో కొనసాగుతుంది. రాష్ట్రంలో ఎక్కడ కూడా మైన్స్ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద వేసిన శిలా ఫలకం గురించి నాకు తెలియదు. కానీ అద్దెభవనంలో విధులు నిర్వహిస్తున్నాం. ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తే ప్రతిపాదనలు పంపిస్తా.
>
> – సత్యనారాయణ, మైన్స్ ఏడీ, తాండూరు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటేశ్



పరిగి: ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

పరిగి: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటేశ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పేదలకు ఇళ్లను మంజూరు చేసిందన్నారు. ప్రతీ నియోజకవర్గానికి ప్రభుత్వం ఏటా 3,500 ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బుచ్చయ్య, గ్రామస్తులు రాకేశ్, మాణిక్యం, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి



వైద్య సేవలను పరిశీలిస్తున్న బాల్‌రెడ్డి తదితరులు

తాండూరు: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన మహిళలకు, చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణ శివారులోని మాతాశిశు ఆసుపత్రిని మున్సిపల్ మాజీ కౌన్సిలర్లతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలు వార్డులు పరిశీలించారు. అనంతరం ఆర్ఎంఓ అనిల్‌కుమార్ రెడ్డితో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. చిన్న పిల్లల వార్డులో వైద్యుడు సతీశ్‌బాబుతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, వెంకన్నగౌడ్, ప్రవీణ్, నాయకులు జిలానీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

❖ నేడు పంటలపై అవగాహన

కొడంగల్ రూరల్: పంటలపై సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు శాస్త్రవేత్తలు పలు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారని మండల వ్యవసాయాధికారి జి తులసి తెలిపారు. గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రుద్రారం రైతు వేదికలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి నిర్వహించనున్న అవగాహన సదస్సులో రాజేష్, మధుశేఖర్‌లు పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారన్నారు.

❖ కార్యకర్తలకు అండగా ఉంటాం

కుల్కచర్ల: కార్యకర్తల కుటుంబాలకు తాము అండగా ఉంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అన్నారు. గురువారం అంతారం గ్రామానికి చెందిన మద్దుల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకొని గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మొగులయ్య, వెంకటయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

❖ అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు మృతి

కుల్కచర్ల: చౌడాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సుకన్య కొంత కాలంగా కిడ్నీ సమస్యతో ఇబ్బందులకు గురవుతూ గురువారం మృతి చెందారు. ఆమె మృతితో పాఠశాలలో తీవ్ర విషాదం నెలకొంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

❖ పింఛన్లను వెంటనే పెంచాలి

మోమిన్‌పేట: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.2వేల నుంచి రూ.4వేలకు పింఛన్లను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఉద్దాల జయపాల్ పేర్కొన్నారు. గురువారం ఏన్కతలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పింఛన్ను రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

❖ విరాళం అందజేత

తాండూరు టౌన్: పట్టణంలోని 25వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ మైనార్టీ యువ నాయకుడు ఎజాజ్ విరాళం అందజేశారు. స్థానిక శివాజీ చౌక్‌లో ప్రతిష్ఠించిన వినాయక పూజలకోసం రూ.11వేలు మండప నిర్వాహకులకు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎజాజ్ మాట్లాడుతూ హిందూ, ముస్లిం భేదభావం లేకుండా ప్రజలంతా కలిసి మెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

❖ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవాబుపేట: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నవాబుపేట తహసీల్దార్ బుచ్చయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ప్రజలందరూ అత్యవసరమైతే తప్పా ఇళ్లల్లో నుంచి బయటికి రావొద్దని పేర్కొన్నారు. రైతులు పొలాలకు వెళ్లే సమయంలో విద్యుత్ సరాఫరా అయ్యే లైన్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలను దాటోద్దని హెచ్చరించారు. ఏదైనా సహాయం అవసరమైనచో సంబంధిత మండల అధికారుల ఫోన్‌నంబర్లపై సంప్రదించాలని సూచించారు.

❖ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: సురాయిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుపనులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని కోరారు.

ఓటర్ లిస్టులో అభ్యంతరాలు తెలపండి

- ఈ నెల 30 వరకు సవరణకు అవకాశం
- ఎంపీడీవోలు



ధారూరు: ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ నర్సింలు తదితరులు



బొంరాస్‌పేటలో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న కార్యదర్శి నాగరాజు తదితరులు

దుద్యాల్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. అందులో భాగంగానే గురువారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటర్ లిస్టులను ప్రదర్శించారు. దుద్యాల్ గ్రామానికి సంబంధించిన 12 వార్డుల జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో మహేశ్ కుమార్, ఎంపీవో సత్యనారాయణ ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో ఓటర్ లిస్టును ఏర్పాటు చేశామన్నారు. ఏమైన అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30 లోపు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది రఘు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

తాండూరు రూరల్: ఓటరు జాబితాకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో తుది జాబితాను గురువారం పంచాయతీ కార్యదర్శులు ప్రదర్శించారు. ఏమైన అభ్యంతరాలు ఉంటే శుక్ర, శని వారాల్లో సంబంధిత కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ సూచించారు.

తుది జాబితా విడుదల

కుల్కచర్ల: రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలను అనుసరించి కుల్కచర్ల మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఓటరు లిస్టును విడుదల చేశారు. 33 గ్రామ పంచాయతీల్లోని మొత్తం 38,187ఓటర్లు ఉండగా అందులో పురుషులు 19,066, మహిళలు 19,316, ఇతరులు 5మంది ఉన్నారని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు.

చౌడాపూర్ మండలంలో...

చౌడాపూర్ మండలంలోని 24గ్రామ పంచాయతీల్లో మొత్తం ఓటర్లు 25,156 ఉండగా అందులో పురుషులు 12,742, మహిళలు 12,413, ఇతరులు ఒక్కరు ఉన్నారని ఎంపీడీఓ సోమలింగం తెలిపారు.

ధారూరు: మండల పరిధిలోని 34 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు ఓటరు జాబితాలను ప్రదర్శించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నర్సింలు, ఎంపీఓ, సూపరింటెండెంట్‌లు ప్రదర్శిచారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ సుశీల్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఫయామ్ తదితరులు పాల్గొన్నారు.

పేర్లను సరిచూసుకోవాలి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని రేగడిమైలారంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు విడుదల చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఓటర్లు తమ పేర్లను సరి చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు దాసరి చంద్రప్ప, గ్రామ అధ్యక్షుడు కుమ్మరి గుండప్ప, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్యామలయ్యగౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, రాజుగౌడ్, కే.రాములు, బంటు మొగులప్ప పాల్గొన్నారు.

పరిగి: ఓటర్ జాబితాను సిద్ధం చేశామని, ఏమైన అభ్యంతరాలు ఉంటే తెలపాలని మండల అభివృద్ధి అధికారులు తెలిపారు. పరిగి ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ జాబితాను ప్రదర్శించినట్లు అభ్యంతరాలు ఉంటే చెప్పాలన్నారు.

బంట్వారం: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాను సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ రాములు తెలిపారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయ నోటీస్ బోర్డుపై ఓటరు జాబితాతో పాటు పోలింగ్ స్టేషన్ల వివరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలో సెక్రెటరీలు ఓటరు జాబితాను అందుబాటులో ఉంచారన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.



పరిగి: ప్రత్యేక పూజలో మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్ కుమార్



కొడంగల్: శాంతినగర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద భక్తులు



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దుద్యాల్: వేంకటేశ్వర స్వామి ఆకారంలో ఏర్పాటు చేసిన గణనాథునికి పూజలు



యాలాల: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద పూజలు



తాండూరు టౌన్ : భద్రేశ్వరుని గుడి వద్ద గణపతి పూజలో ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి



అనంతగిరి: 24వ వార్డులో ప్రతిష్ఠించిన మట్టి గణనాథుని వద్ద మహిళల పూజలు



బంట్వారం: యాచారంలో గణనాథుడి సన్నిధిలో పూజలో భక్తులు



తాండూరు రూరల్: హనుమాన్ దేవాలయ సమీపంలో గణనాథుడికి పూజలు



కొడంగల్ రూరల్‌లో..

వైభవంగా వినాయక పూజలు

వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని ప్రతీ గ్రామంలో బుధవారం వినాయక చవితిని పురస్కరించుకుని ఇళ్లల్లో, ఆయా మండపాల్లో నిర్వాహకులు గణనాథులను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, కాలనీపెద్దలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలన్నారు. పండుగలు సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకలుగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.



తాండూరు టౌన్: గంజ్ ఆవరణలో వినాయక పూజలో ఎమ్మెల్యే బీఎమ్మార్



ధారూరు: డీకే తండాలో..



దౌల్తాబాద్: పూజలు చేస్తున్న భక్తులు



నవాబుపేట: నారెగూడలో..



పూడూరులో పూజలు చేస్తున్న యువకులు

వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తుల ఆహ్వానం

దుద్యాల్: సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లకోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి నాగరాజు పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, మహిళ, చిన్న, సన్నకారు రైతులు ఐదెకరాల లోపు భూమి కల్గిన వారికి 50 శాతం సబ్సిడీతో, ఇతర రైతులకు 40శాతంతో పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులు చేసుకునేందుకు ఆగస్టు 30 చివరి తేదీగా ప్రకటించారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: ప్రభుత్వం రాయితీపై అందించే వ్యవసాయ పనిముట్లకు మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పోలప్ప పేర్కొన్నారు. యాంత్రీకరణలో ఇప్పటివరకు లబ్ధి పొందని మహిళా రైతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. 215 బ్యాటరీ చేతిపంపు, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్ 32, రోటవేటర్లు 11, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్ 2, డిస్క్ హర్రో కల్టివేటర్లు 16, ఎంబీ ప్లౌగ్ కేజ్ వీల్స్, రోటో పడ్లర్, బండ్ ఫార్మర్, బ్రష్ కట్టర్ 2, పవర్‌వీడర్, పవర్ టిల్లర్‌లు 2, స్ట్రాబెలర్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇతర వివరాలకు సంబంధిత ఏఈఓలను సంప్రదించాలన్నారు.

ఆర్థిక సాయం

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన గునుగారి ఆనంద్ ఆర్థిక ఇబ్బందులకు గురై అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన బొల్లి అనంతరెడ్డి విషయం తెలుసుకొని గురువారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన రూ.10వేలు, కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బ్యాగరి రాములు రూ. వెయ్యి అంత్యక్రియల నిమిత్తం సాయం అందజేశారు.

ఓటరు జాబితాపై రేపు సమావేశం

తాండూరు రూరల్: గ్రామ పంచాయతీలో ప్రదర్శించిన ఓటరు జాబితాలోని అభ్యంతరాలపై శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 10:30కు నిర్వహిస్తారని తెలిపారు. కావున ఆయా రాజకీయ పార్టీల నాయకులు సకాలంలో హాజరుకావాలని కోరారు.